సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 10 । జనవరి । 2023



రేగి పండ్ల అలంకరణ

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి 200 కిలోల రేగి పండ్లతో విశేష అలంకరణ చేశారు.



బంగారం సమర్పణ

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మావుళ్లమ్మ వారికి పెన్మత్స సత్యనారాయణరాజు దంపతులు (చిలుకూరు) చేకూరి రమావతి పేరున 32 గ్రాముల బంగారం విరాళంగా సమర్పించారు.



పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 22న హైదరాబాద్ తెలుగు వర్సిటీలో జరిగే యువజన కళాఉత్సవ్ పోస్టర్‌ను డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఆవిష్కరించారు.

న్యూస్‌రీల్

హస్తకళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



కమిషనర్ అపర్ణలక్ష్మి

సాక్షి, భీమవరం: హస్తకళల అభివృద్ధి, ఉత్పత్తి, మార్కెటింగ్ సౌకర్యాల కోసం ప్రభుత్వం పథకాలను అమలుచేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని హస్తకళల అభివృద్ధి సంస్థ డెవలప్‌మెంట్ కమిషనర్ అపర్ణలక్ష్మి అన్నారు. భీమవరంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సోమవారం హస్తకళల అభివృద్ధి, ఉత్పత్తి, ప్రభుత్వ పథకాలు అనే అంశం జరిగిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డీఆర్‌డీఏ డీపీఎం దాసరి వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాస్, సువర్ణల తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత మలసానికుంట




విజేత జట్టుకు బహుమతి అందిస్తున్న ఇన్‌చార్జి డీఎస్పీ పైడేశ్వరరావు

ద్వారకాతిరుమల: సంప్రదాయ క్రీడలే ముద్దు.. జూదాలు వద్దని ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ పైడేశ్వరరావు అన్నారు. స్థానిక శ్రీవారి దేవస్థానం హైస్కూల్ గ్రౌండ్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 8న ప్రారంభమైన వాలీబాల్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. మొత్తం 15 జట్లు తలపడగా మలసానికుంట జట్టు విజేతగా, సత్తెన్నగూడెం జట్టు రన్నరప్‌గా నిలిచాయి. డీఎస్పీ పైడేశ్వరరావు, భీమడోలు సీఐ వెంకటేశ్వరరావు, ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ ట్రోఫీలతో పాటు విజేత జట్టుకు రూ.10 వేలు, రన్నరప్ జట్టుకు రూ.5 వేలు, బెస్ట్ ప్లేయర్‌గా నిలిచిన మలసానికుంటకు చెందిన పాకనాటి రమేష్‌కు రూ.2 వేల నగదును బహుమతిగా అందజేశారు. డీఎస్పీ పైడేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాల మేరకు టోర్నమెంట్‌ను నిర్వహించామని, సంక్రాంతి సందర్భంగా యువత జూద క్రీడల వైపు మరలకుండా సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలన్నారు. కుటుంబంతో కలిసి పండగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

కోడిపందేల కట్టడికి కంట్రోల్ రూమ్

నూజివీడు: నూజివీడు రెవిన్యూ డివిజన్ పరిధిలో కోడిపందేల నియంత్రణకు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ కంట్రోల్ రూమ్ ఈనెల 12వ తేదీ నుంచి 17 వరకు పనిచేస్తుంది. 24 గంటలూ కంట్రోల్‌రూమ్‌లో సిబ్బంది విధులు నిర్వహిస్తారు. ఎక్కడైనా కోడిపందేలు నిర్వహిస్తున్నా, నిర్వహించడానికి బరులు ఏర్పాటు చేసినా, గ్యాంబ్లింగ్‌లు, పేకాట, గుండాట, ఇతర జూదాలు నిర్వహిస్తున్నా వెంటనే కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 08656-232717కు తెలియజేయాలని సబ్ కలెక్టర్ కోరారు.

బ్యాంకు ఖాతాదారుల ధర్నా



ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధితులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ఓ ప్రైవేట్ బ్యాంకు బ్రాంచీ కార్యాలయం వద్ద సోమవారం ఖాతాదారులు పురుగుమందు డబ్బా పట్టుకుని ఆత్మహత్య చేసుకుంటామంటూ ధర్నాకు దిగారు. వివరాలిలా ఉన్నాయి.. వెంకటాపురం గ్రామానికి చెందిన వేముల దుర్గారావు 2021లో రూ.5 లక్షలను బ్యాంకులో డిపాజిట్ చేశారు. సోమవారం నగదు తీసుకునేందుకు దుర్గారావు రాగా బ్యాంకు అధికారులు ఆయన ఖాతాలో సొమ్ములు లేవని వెనక్కి పంపించారు. దీంతో కుటుంబ సభ్యులంతా వచ్చి పురుగుమందు డబ్బా పట్టుకుని ఆందోళనకు దిగారు. తమ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే మరో బాధితురాలు దర్బగూడేనికి చెందిన డి.పాపాయమ్మ కూడా బ్యాంకులో రూ.27 లక్షలు డిపాజిట్ చేశానని, తనకు బ్యాంకు అధికారులు సొమ్ములు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమయంలో బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్ బాధితులతో మాట్లాడినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ఖాతాదారులు నగదు డిపాజిట్ చేసిన సమయంలో తాను మేనేజర్‌గా లేనని, ఆ సమయంలో ఏం జరిగిందో తనకు తెలియదని ఆయన అన్నారు. అనంతరం బ్యాంకును మూసి వేసి తాళం వేసుకుని మేనేజర్ వెళ్లిపోయారు. కొద్దిసేపు బాధితులు ధర్నా చేసి వెనుదిరిగారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని జంగారెడ్డిగూడెం ఎస్సై ఎం.సాగర్ బాబు చెప్పారు.

సంక్షేమానికి మహా సంకల్పం

ప్రజా సంకల్ప పాదయాత్ర ముగిసి నాలుగేళ్లు

- జిల్లావ్యాప్తంగా వైఎస్సార్ సీపీ శ్రేణుల సంబరాలు
- ఉమ్మడి జిల్లాలో 13 నియోజకవర్గాల్లో 300 కిలోమీటర్లకు పైగా సాగిన యాత్ర
- అడుగడుగునా జన నీరాజనం



తూర్పుపాలెంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఆచంట ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు



భీమవరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షిప్రతినిధి, ఏలూరు : ప్రజా సంక్షేమమే పరమావధిగా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర పూర్తయి నాలుగేళ్లయిన సందర్భంగా సోమవారం జిల్లావ్యాప్తంగా పార్టీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. 2018లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుదీర్ఘంగా జరిగిన పాదయాత్రకు జనం నీరాజనాలు పలికారు. 13 నియోజకవర్గాల్లో 300 కిలోమీటర్ల మేర 28 రోజులపాటు యాత్ర సాగింది. దెందులూరు నియోజకవర్గంలో ప్రారంభమైన యాత్ర కొవ్వూరు నియోజకవర్గంలో ముగిసింది. ఈ క్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్యులు పాదయాత్ర ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్నారు.

2 వేల మైలురాయికి చిహ్నంగా..

ఉమ్మడి పశ్చిమలో 2018 మే 13 నుంచి జూన్ 11 వరకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్ర నిర్వహించారు. దెందులూరు, ఏలూరు, గోపాలపురం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, ఉండి, భీమవరం, నరసాపురం, పాలకొల్లు, ఆచంట, తణుకు, నిడదవోలు, కొవ్వూరు నియోజకవర్గాల్లో సాగిన పాదయాత్రలో అనేక కీలక ఘట్టాలకు జిల్లా సాక్షిభూతంగా నిలిచింది. ఏలూరు మండలంలో 2,000 కిలోమీటర్ల యాత్ర చేరుకున్న సందర్భంలో అక్కడ 40 అడుగుల పైలాన్‌ను జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం పిప్పరలో 2,200 కిలోమీటర్లకు యాత్ర చేరుకోగా మొక్క నాటారు. కొవ్వూరు నియోజకవర్గంలో 2,300 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా నందమూరు క్రాస్ రోడ్డులో పార్టీ జెండాను ఆవిష్కరించి మొక్క నాటారు. ప్రతి నియోజకవర్గంలో అశేష జనవాహిని పోటెత్తడంతో పాటు వేలాదిగా వచ్చిన వినతులు స్వీకరించి పశ్చిమ పార్టీ కేడర్‌లో జగన్‌మోహన్‌రెడ్డి జోష్ నింపారు. దీంతో 2019 సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో వైఎస్సార్‌సీపీ రికార్డు స్థాయిలో దూసుకెళ్లింది. 15 నియోజకవర్గాలకుగాను 13 స్థానాల్లో పార్టీ అభ్యర్థులు అపూర్వ విజయం సాధించారు.

ఉమ్మడి జిల్లాలో కార్యక్రమాలు ఇలా..

- ఏలూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ముందుగా కార్యాలయంలో దివంగత నేత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- ఆచంట నియోజకవర్గంలోని పోడూరు మండలం తూర్పుపాలెంలో పార్టీ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పెనుమంట్ర ప్రభుత్వాస్పత్రిలో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. పెనుగొండలో కేక్ కట్ చేశారు.
- భీమవరంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



తణుకులోని జెడ్పీ బాలుర హైస్కూల్ వద్ద వైఎస్సార్ సీపీ నాయకుల సంబరాలు

- ఉంగుటూరు నియోజకవర్గం గణపవరంలోని వైఎస్సార్ కాలనీలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడే కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.
- చింతలపూడి నియోజకవర్గంలోని జంగారెడ్డిగూడెంలో ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా కేక్ కట్ చేశారు. నాయకులు, కార్యకర్తలు సమక్షంలో సంబరాలు చేశారు.
- కైకలూరు సంత మార్కెట్, కలిదిండి సెంటరులో వైఎస్సార్ విగ్రహాల వద్ద ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు కేక్ కట్ చేసి వేడుకలు చేశారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సంబూరి శ్రీదేవి పాల్గొన్నారు.
- నూజివీడులోని బాపు నగర్‌లో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప అప్పారావు కేక్ కట్ వేడుకలు నిర్వహించారు.
- ఉండి నియోజకవర్గం కాళ్ల మండలంలోని క్యాంపు కార్యాలయంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలను నూరు శాతం అమలుచేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.
- పాలకొల్లులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ బోర్డు మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, వైస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- తణుకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మండల నాయకులు కేక్ కట్‌చేసి, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- దెందులూరు నియోజకవర్గంలోని గోపన్నపాలెంలో మండల నాయకులు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

ఫిర్యాదులపై సత్వర విచారణ

ఎస్పీ రవిప్రకాష్



స్పందనలో బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం : స్పందన కార్యక్రమంలో బాధితులిచ్చిన ఫిర్యాదులపై సత్వర విచారణ చేపట్టి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ యు.రవిప్రకాష్ పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశాలిచ్చారు. సోమవారం భీమవరం డీఎస్పీ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో 14 మంది నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. బాధితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదుల్లో కొన్ని.. భీమవరం వన్‌టౌన్‌కు చెందిన మహిళ తనను ఒక వ్యక్తి నమ్మించి డబ్బులు తీసుకుని తిరిగి ఇవ్వడకుండా మోసం చేశాడని న్యాయం చేయాలని కోరింది. కో-ఆపరేటివ్ సొసైటీలో రుణం ఇప్పిస్తానని మోసం చేశారని వారిపై చర్యలు తీసుకోవాలని మరో వ్యక్తి ఫిర్యాదు చేశారు. పాలకోడేరు మండలానికి చెందిన ఓ వ్యక్తి తన మోటార్ సైకిల్ చోరీ జరిగినా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయడం లేదని వాపోయాడు. తణుకు మండలానికి చెందిన మహిళ తన భర్త, అత్త, ఆడపడుచు కట్నం కోసం వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఆయా సమస్యలపై పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

ఏలూరు టౌన్ : ఏలూరు జిల్లాలో రానున్న సంక్రాంతి పండగ రోజుల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉక్కుపాదం మోపుతామని జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ హెచ్చరించారు. స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, పేకాట శిబిరాలు, గుండాట నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. యువత అసాంఘిక కార్యక్రమాల వైపు వెళితే అనర్థాలు తప్పవన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల నడవడికపై శ్రద్ధ చూపాలని కోరారు. వీటిపై సమాచారం ఉంటే డయల్ 100 లేదా 83329 59175, 95503 51100 నంబర్లకు సమాచారం ఇవ్వాలని , వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం

జాయింట్ కలెక్టర్ మురళి



భీమవరం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న జేసీ మురళి

భీమవరం(ప్రకాశం చౌక్): స్పందన అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ జేవీ మురళి ఆదేశించారు. భీమవరం కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను గడువులోపు పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీలను రీఓపెన్ కాకుండా స్పష్టతతో పరిష్కరించాలని ఆదేశించారు. పరిష్కారం చేసేటప్పుడు ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఫొటో అప్‌లోడ్ చేయాలని సూచించారు. స్పందన కార్యక్రమంలో 168 అర్జీలు వచ్చాయన్నారు. ఇన్‌చార్జి డీఆర్వో దాసి రాజు, డీపీఓ ఎం.నాగలత, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, డీఎస్పీ బి.శ్రీనాథ్ పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- పాలకోడేరు మండలం గరువు కొత్తపేటలో సీసీ రోడ్డు నిర్మాణాన్ని కొందరు అడ్డుకుంటున్నారని, దీంతో నిర్మాణం నిలిచిపోయిందని స్థానికులు ఫిర్యాదు చేశారు.
- ఆర్అండ్‌బీ అధికారులు తమ ఇళ్లను తొలగించాలని ఒత్తిడి చేస్తున్నారని, ఇళ్లు తొలగిస్తే తమ పరిస్థితి ఏంటని తాడేపల్లిగూడెం మండలం పెద తాడేపల్లి శివారుకు చెందిన 6 కుటుంబాలకు చెందిన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.
- ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం పాల కేంద్రం వద్ద తమకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని దానికి సంబంధించి జియో ట్యాగింగ్ కూడా పూర్తిచేశారని, అయితే అక్కడ కాకుండా 6 కిలోమీటర్ల దూరంగా స్థలాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని, తమకు పాల కేంద్రం వద్దే స్థలాలు ఇప్పించాలని మహిళలు జేసీని కోరారు.

సక్రమంగా భూహక్కు పత్రాల జారీ

భూహక్కు పత్రాలను భూమిని కొనుగోలు చేసిన వారికి మాత్రమే అందేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ జేవీ మురళి తహసీల్దార్లను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం ఆయన పలు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భూమిని కొనుగోలు చేసిన వారికే భూహక్కు పత్రాలను అందజేయాలని, వారితో మ్యూటేషన్ దరఖాస్తు చేయించి ఈకేవైసీ ద్వారా పేరు మార్పు చేయాలని సూచించారు. ఇళ్ల పట్టాలకు అవసరమైన భూమిని గుర్తించే ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. శ్మశాన వాటికలకు స్థల కేటాయింపుల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భూ రీసర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు.

'జగనన్నకు చెబుదాం'పై అప్రమత్తం

స్పందన పోర్టల్‌లో 'జగనన్నకు చెబుదాం' అనే కార్యక్రమంలో కొందరు దరఖాస్తులు పెడుతున్నారని, 24 గంటల్లోపు వాటిని పరిశీలించాలని జేసీ మురళి ఆదేశించారు. కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాంపై అధికారులతో సమీక్షించారు. 24 గంటల లోపు దరఖాస్తును సంబంధిత అధికారి ఓపెన్ చేసి చూడకపోతే సీఎంఓ కార్యాలయం నుంచి నేరుగా కలెక్టర్ లేదా సంబంధిత అధికారికి ఫోన్ వస్తుందన్నారు. ఇన్‌చార్జి డీఆర్వో దాసి రాజు, సబ్‌కలెక్టర్ సూర్యతేజ, డీపీఓ ఎం.నాగలత, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, డీఎస్పీ బి.శ్రీనాథ్ పాల్గొన్నారు.

'బరి'తెగిస్తే ఖబడ్దార్

- కోడిపందేల కట్టడికి పటిష్ట చర్యలు
- బరులు ధ్వంసం చేయిస్తున్న పోలీసులు
- జిల్లాలో 2,100 కేసుల నమోదు



పాలకోడేరు మండలం పెన్నాడలో బరిని ధ్వంసం చేయిస్తున్న భీమవరం రూరల్ సీఐ, ఎస్సైలు

సాక్షి, భీమవరం: సంక్రాంతి పండగకు సంప్రదాయం పేరుతో జరిగే కోడిపందేల కట్టడికి పోలీసుశాఖ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. పండగ మూడు రోజులపాటు నిర్వహించే కోడి పందేలు, జూదాలను అడ్డుకోవడంపై జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు గత 15 రోజులుగా జిల్లావ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో పందేలకు బరులు ఏర్పాటుచేసే ప్రాంతాలను పరిశీలించడంతో పాటు నిర్వాహకులతో మాట్లాడటం, జూదాలు నిర్వహించిన వారిని ముందుస్తు బైండోవర్ చేయడం, కోడి కత్తులు తయారీ, కట్టేవారిపై ప్రత్యేక నిఘా పెట్టి అదుపులోనికి తీసుకుని కేసులు నమోదు చేయడం, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్), పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో పందేల వల్ల కలిగే అనర్థాలను విస్తృతంగా ప్రచారం చేయడం వంటి చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు సుమారు 2,100 కేసులు నమోదుచేసి కత్తులు తయారుచేసేవారిని 155 మంది గుర్తించి 50 కత్తులను సీజ్ చేశారు.



శృంగవృక్షంలో బరిని ట్రాక్టర్‌తో ధ్వంసం చేయిస్తున్న పోలీసులు

గ్రామస్తుల సహకారంతో కట్టడి

సంక్రాంతి జూదాలను కట్టడి చేయడానికి పోలీసుశాఖ గ్రామస్థాయి కమిటీల సమన్వయంతో పని చేస్తోంది. ప్రతి గ్రామంలో వలంటీర్లు, సచివాలయ పోలీసు సిబ్బంది అందుబాటులో ఉండటంతో ముందుస్తుగా బరులను సిద్ధం చేస్తున్న ప్రాంతాలపై సమాచారం సేకరిస్తున్నారు. గతంలో పందేలు వేసిన బరుల స్థల యజమానులకు ముందస్తు నోటీసులిచ్చి పందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.


విస్తృత తనిఖీలు

గ్రామాల్లో పందేలు నిర్వహించే అవకాశం ఉన్న ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. పందేలను సిద్ధం చేస్తున్న బరులను, పందేలకు అనువుగా ఉన్న స్థలాలను ట్రాక్టర్లతో దున్నించి ధ్వంసం చేయిస్తున్నారు. అలాగే గతంలో పందేలు నిర్వహించిన జూదరులను హెచ్చరించడంతో పాటు అనర్థాలపై పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు.

ప్రత్యేక నిఘా

ఏటా జిల్లావ్యాప్తంగా మూడు రోజులుపాటు కోడి పందేలు జరుగుతున్నాయి. ప్రధానంగా భీమవరం, కాళ్ల, యలమంచిలి, మొగల్తూరు, పెంటపాడు, తణుకు, పెనుగొండ, అత్తిలి, వీరవాసరం, పాలకొల్లు, పోడూరు, ఆకివీడు మండలాల్లో భారీ పందేలు జరుగుతుండటంతో పోలీసు అధికారులు ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టారు.

కఠిన చర్యలు



సంక్రాంతికి సంప్రదాయం పేరుతో కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే సుమారు 2 వేల మందికి పైగా కేసులు నమోదు చేశాం. జూదాల వల్ల కలిగే అనర్థాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. పండగలకు ఆనందంగా చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం.

– యు.రవిప్రకాష్, ఎస్పీ, భీమవరం

బలివే శివరాత్రి ఉత్సవాలలో తాత్కాలిక దుకాణాలు



వేలం నిర్వహిస్తున్న అధికారులు

ముసునూరు: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా బలివే రామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో తాత్కాలిక దుకాణాల ఏర్పాటు ద్వారా రూ.12,50,000 ఆదాయం లభించినట్లు ఈఓ టి.విశ్వేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆలయం వద్ద వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజల సమక్షంలో దేవదాయశాఖ అధికారులు దుకాణాల సముదాయాలు, కొబ్బరి చెక్కల సేకరణ కోసం వేలం నిర్వహించారు. దుకాణాల ఏర్పాటు హక్కు కోసం జరిగిన వేలంలో బలివేకు చెందిన పిల్లి రెడ్డియ్య రూ.10,50,000కు దక్కించుకోగా, కొబ్బరి చెక్కల వేలంలో అన్నవరానికి చెందిన పల్నాటి పరమేశ్వరి రూ.2,00,000కు దక్కించుకున్నారు. గతేడాది కన్నా రూ.1.99 లక్షల అధిక ఆదాయం లభించిందన్నారు. తనిఖీదారు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్దాలకు జాతీయ విశిష్ట సేవా పురస్కారం


మద్దాల పెద్దిరాజుకు జాతీయ పురస్కారాన్ని అందించి సత్కరిస్తున్న దృశ్యం

భీమడోలు: పోలసానిపల్లికు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు మద్దాల పెద్దిరాజు సాహితీ రంగంలో చేస్తున్న విశిష్ట సేవలకు గాను తెలుగుతేజం జాతీయ విశిష్ట సేవా పురస్కారం అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా చిట్యాలలో జరిగిన పుడమి సాహితీ వేదిక నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మద్దాల పెద్దిరాజు ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. పుడమి సాహితీ వేదిక అధ్యక్షుడు డాక్టర్ చిలుముల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం తెలుగు కవుల వంశీయులు ఏనుగు శివరామప్రసాద్, డాక్టర్ కావూరి శ్రీనివాసశర్మ, కంచర్ల శ్రీనివాసశర్మ, మున్నెల్లి శివశంకయ్య, గిడుగు వెంకట నాగేశ్వరరావు చేతుల మీదుగా పురస్కారాన్ని అందించి దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందించారని పెద్దిరాజు సోమవారం విలేకరులతో తెలిపారు. ఆయనను సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా, ప్రజాప్రతినిధులు అభినందించారు.

తీరం అభివృద్ధికి మార్గం సుగమం

- రూ.75 కోట్లతో 10 ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధి
- నిధులు విడుదల చేస్తూ 3 జీవోల జారీ
- ముఖ్యమంత్రి పర్యటన తరువాత నిధులు
- మత్స్య, కొబ్బరి ఎగుమతులకు దోహదం

నరసాపురం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న పేరుపాలెం బీచ్‌కు అనుసంధానంగా పలు ప్రధాన రహదారులు అభివృద్ధికి నోచుకోనున్నాయి. ముఖ్యంగా తీర గ్రామాలను అనుసంధానం చేస్తూ ఈ రహదారులను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లాలో 19 కిలోమీటటర్ల మేర సముద్ర తీరం ఉన్న ఏకైక ప్రాంతం నరసాపురం. ఏటా ఇక్కడి నుంచి రూ.300 కోట్ల వరకూ మత్స్య ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. కొబ్బరి ఎగుమతుల్లో కూడా తీరప్రాంతం ప్రాముఖ్యతను కలిగి ఉంది. మరోపక్క బియ్యపుతిప్పలో రూ.600 కోట్లతో నిర్మించే ఫిషింగ్ హార్బర్ పనులకు గత ఏడాది నవంబర్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారు.

టెండర్ ప్రక్రియ పూర్తయిన ఈ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో నరసాపురంలో 10 ఆర్అండ్‌బీ రహదారులను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.75 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇప్పుడు ప్రధాన రహదారుల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించడంతో హార్బర్ ప్రాంతానికి కూడా ప్రయాణ సౌలభ్యం మెరుగుపడనుంది. అలాగే మత్స్య, కొబ్బరి ఎగుమతులకు ఉపయోగం ఉంటుంది. ఇప్పటికే 215 జాతీయ రహదారి మొగల్తూరు మీదుగా ఒంగోలు వరకూ అందుబాటులోకి వచ్చింది. ఇక తీరప్రాంతం నుంచి నేరుగా జాతీయ రహదారికి మార్గం సుగమం అవుతుంది. ఉమ్మడి పశ్చిమలో తీర ప్రాంతం పర్యాటక రంగం అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని కూడా రాష్ట్ర ప్రభుత్వం తీరప్రాంత రహదారుల అభివృద్ధికి ఇంత భారీ స్థాయిలో నిధులు మంజూరు చేసింది.


ముత్యాలపల్లి-పేరుపాలెం బీచ్ రోడ్డు


ఇరుగ్గా ఉన్న లక్ష్మణేశ్వరం-పెదమైనవానిలంక వయా తూర్పుతాళ్లు రోడ్డు

అభివృద్ధికి నోచుకోనున్న రహదారులు ఇవే..

లక్ష్మణేశ్వరం-పెదమైనవానిలంక వయా తూర్పుతాళ్లు	రూ.20 కోట్లు
నరసాపురం-సారవ వయా లక్ష్మణేశ్వరం	రూ.3 కోట్లు
ముత్యాలపల్లి నుంచి పేరుపాలెం బీచ్ వరకు సీసీరోడ్డు	రూ.24 కోట్లు
తూర్పుతాళ్లు సెంటర్ నుంచి పేరుపాలెం సెంటర్ వరకూ	రూ.4 కోట్లు
జిల్లేటితిప్ప నుంచి జగన్నాథపురం వరకూ నీటితిప్ప మీదుగా	రూ.3 కోట్లు
కొత్తోట నుంచి జిల్లా కేంద్రం భీమవరం వెళ్లే రోడ్డు	రూ.4కోట్లు
జగన్నాథపురం నుంచి పాతపాడు	రూ.3 కోట్లు
మెట్టిరేవు నుంచి పేరుపాలెం బీచ్ వరకు వయా కేపీ పాలెం	రూ.8 కోట్లు
బియ్యపుతిప్ప నుంచి వేములదీవి వరకు రోడ్డు	రూ.3.30 కోట్లు
లక్ష్మణేశ్వరం నుంచి వయా పీతానిమెరక, రామన్నపాలెం	రూ.2.70 కోట్లు

టెండర్లు పిలిచి పనులు మొదలు పెడతాం



తీరంలో పది ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ.75 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఆర్అండ్‌బీశాఖ ద్వారా ప్రభుత్వం 3 జీవోలు ఇచ్చింది. టెండర్ల ప్రక్రియ ప్రారంభించాం. పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం. తీరంలో రోడ్ల అభివృద్ధికి ఇంత మొత్తంలో ఒకేసారి ప్రభుత్వం నిధులు కేటాయించడం గతంలో ఎన్నడూ లేదు. మత్స్య ఎగుమతులకు, పేరుపాలెం బీచ్ అభివృద్ధికి, పర్యాటకరంగం అభివృద్ధికి ఈ రోడ్ల అభివృద్ధి దోహదం చేస్తుంది. తుఫాన్‌లు, సునామీల వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించే విధంగా ప్రభుత్వం సులభంగా చర్యలు తీసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

ముఖ్యమంత్రి పర్యటన తరువాత రోడ్లకు నిధులు

గత ఏడాది నవంబర్ 21వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నరసాపురంలో పర్యటించారు. రికార్డు స్థాయిలో రూ.3,300 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తీరప్రాంతంలో రహదారుల అభివృద్ధి ఆవశ్యకతను అప్పుడే ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పది ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ.75 కోట్లు మంజూరు చేసింది. దీనికి సంబంధించి డిసెంబర్‌లోనే ప్రభుత్వం ఆర్అండ్‌బీ శాఖ ద్వారా జీవో నంబర్లు 333, 334, 335 విడుదల చేసింది.

నేత్రపర్వంగా శ్రీవారి తిరువీధి సేవ

ద్వారకాతిరుమల: ధనుర్మాస వేడుకల్లో భాగంగా ఉదయం, ద్రవిడ ప్రబంధ అధ్యయనోత్సవాలను పురస్కరించుకుని శ్రీవారి తిరువీధి సేవలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం జరిగిన స్వామివారి గ్రామోత్సవాలు భక్తులకు కనువిందు చేశాయి. ముందుగా ఆలయంలో శ్రీవారు, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించిన తొళక్క వాహనంపై ఉంచి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా స్వామివారి వాహనం తిరువీధి సేవకు పయనమైంది. అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, డోలు, సన్నాయి వాయిద్యాలు, అశ్వ, గజ సేవల నడుమ చినవెంకన్న క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. ప్రతి ఇంటి ముంగిట భక్తులు స్వామివారికి నీరాజనాలు సమర్పించారు. అనంతరం స్థానిక ధనుర్మాస మండపంలో స్వామి, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు జరిపి, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

భార్యాభర్తల ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ భర్త మృతి, భార్య పరిస్థితి విషమం

మొగల్తూరు: ప్రేమించి పెళ్లి చేసుకున్న అనంతరం కాపురంలో కలహాలతో భార్యాభర్తలు పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో భర్త చికిత్స పొందుతూ మృతి చెందగా, భార్య పరిస్థితి విషమంగా ఉంది. వివరాలిలా ఉన్నాయి. మొగల్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని భీమవరం మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన ఆకుల ఆమోషు (23), సునీత ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. గత కొంతకాలంగా వీరు తగాదా పడుతున్నారు. ఈ నెల 8న భార్యాభర్తలిద్దరూ పురుగుమందు తాగగా, వీరిని మొగల్తూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం భర్త ఆకుల ఆమోషు మృతి చెందాడు. మృతుని మేనమామ సన్నమండ పెద్దిరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కళాశాలల్లో సం'క్రాంతి'


ఏలూరు సీఆర్‌రెడ్డి కళాశాలలో సంక్రాంతి సంబరాల కార్యక్రమంలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు


భీమవరం సీఎస్ఎన్ కళాశాలలో మెహందీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట)/సాక్షి, భీమవరం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని కళాశాలల్లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహిస్తున్న వివిధ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. ఏలూరులోని సర్ సీఆర్ఆర్ విద్యా సంస్థలకు చెందిన ఎనిమిది కళాశాలల్లో, భీమవరం సీఎస్ఎన్ కళాశాలల్లో సోమవారం విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించారు. ఏలూరులో రంగవల్లుల, సంప్రదాయ పిండి వంటలు, మెహందీ, జస్ట్ ఏ మినిట్ వంటి పోటీలు నిర్వహించగా, విద్యార్థినులు, ఉపాధ్యాయినులు సంప్రదాయ వస్త్రధారణతో ఆయా పోటీల్లో పాల్గొన్నారు. విద్యా సంస్థల పాలక మండలి కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్, కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్, డైరెక్టర్ కేవీఆర్ఎస్ఎస్ కొండయ్యరావు పాల్గొన్నారు. భీమవరంలోని డాక్టర్ చీడే సత్యనారాయణ కళాశాలలో విద్యార్థులకు మెహందీ, హెయిర్‌స్టైల్, వాలీబాల్, గాలిపటాలు, కబడ్డీ, మ్యూజికల్ చైర్స్, ఫ్యాషన్ షో వంటి పోటీలు నిర్వహించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ, ప్రిన్సిపాల్ సకుమళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.


సంక్రాంతి శోభ ఉట్టిపడేలా రంగోలి వేస్తున్న విద్యార్థినులు


భీమవరంలో హెయిర్‌స్టైల్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

● గడపగడపనా సంక్షేమ పండుగ


తాడేపల్లిగూడెం రూరల్: చినతాడేపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ


పెనుగొండ (ఆచంట): ఆచంట వేమవరంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళకు పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

16న శ్రీవారి కనుమ ఉత్సవం

ద్వారకాతిరుమల: దొరసానిపాడులో ఈనెల 16న నిర్వహించే శ్రీవారి కనుమ ఉత్సవానికి ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా కనుమ మండపాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. మండప పరిసరాలను సుందరీకరిస్తున్నారు. ఏటా సంక్రాంతి పర్వదినాల్లో కనుమ పండుగనాడు సాయంత్రం చినవెంకన్న, ఉభయ దేవేరులతో దొరసానిపాడు గ్రామానికి అట్టహాసంగా వెళతారు. ఏడాదికోసారి తమ గ్రామానికి విచ్చేసే స్వామివారి ఆగమనం కోసం ఆ గ్రామస్తులు నియమనిష్టలతో, భక్తిప్రపత్తులతో వేచి ఉంటారు. మాంసాహారాన్ని భుజించే కనుమనాడు సైతం వారు మాంసాహారాన్ని ముట్టరు. ఉభయ దేవేరులతో కొలువైన స్వామివారు రాజాధిరాజ వాహనాన్ని అధిరోహించి క్షేత్రం నుంచి బయలుదేరి అక్కడకు వెళతారు. ఈ ఏడు కూడా ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు పర్యవేక్షణలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.


మేడపాడులో గతేడాది బరిని ట్రాక్టర్‌తో దున్నిస్తున్న ఎస్సై ప్రసాద్


కొణితివాడలో బరిని ధ్వంసం చేయిస్తున్న దృశ్యం

ధ్వంసం బరా'బరి'

కోడిపందేలను అడ్డుకునేందుకు పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారు. గ్రామాల్లో తోటల్లో రహస్యంగా సిద్ధం చేస్తున్న కోడిపందేల బరులను గుర్తించి వాటిని ధ్వంసం చేస్తున్నారు. వాటిని పందేలకు అనువుగా లేకుండా ట్రాక్టర్లతో దున్నించివేస్తున్నారు. అంతేకాక బరి ఏర్పాటుకు స్థలం ఇస్తున్న యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తున్నారు. పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాల, దగ్గులూరు, లంకలకోడేరు, వడ్లవానిపాలెం, చింతపర్రు, దిగమర్రు, వాలమర్రు గ్రామాల్లో కోడిపందేలకు సిద్ధం చేసిన బరులను ఎస్సై కె.శ్రీనివాస్, యలమంచిలి మండలంలోని కలగంపూడి, మేడపాడు, కట్టుపాలెంలో గత ఏడాది కోడిపందేల కోసం ఉపయోగించిన బరులను ఎస్సై జాజుల విజయ్‌నాగప్రసాద్, అదేవిధంగా వీరవాసరం మండలం కొణితివాడలో కోడిపందేల బరిని దమ్ము ట్రాక్టర్లతో ధ్వంసం చేయించారు.

– పాలకొల్లు అర్బన్./యలమంచిలి./వీరవాసరం


చింతపర్రులో బరిని ట్రాక్టర్‌తో దున్నిస్తున్న రూరల్ ఎస్సై కె.శ్రీనివాస్

సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి


భారతీయ విద్యా భవన్స్‌లో సంక్రాంతి సంబరాల్లో మాట్లాడుతున్న చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పాలకొల్లు అర్బన్: పల్లె జీవనానికి అద్దం పట్టే పండుగ సంక్రాంతి అని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే, భారతీయ విద్యా భవన్స్ చైర్మన్ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. వడ్లవానిపాలెంలో భవన్స్ నూతన ప్రాంగణంలో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సబ్ కలెక్టర్ మల్లవరపు సూర్యతేజ, డీఎస్పీ రవి మనోహరాచారి ముఖ్య అతిథులుగా పాల్గొని భారతీయ సంస్కృతీ సంప్రదాయలకు చిరునామా సంక్రాంతి అని అభివర్ణించారు. భవన్స్ ప్రాంగణంలో భోగి మంట వేశారు. రంగవల్లులు తీర్చిదిద్ది గొబ్బిళ్లు పెట్టి విద్యార్థులు నృత్యాలు చేశారు. బొమ్మల కొలువు, భోగిపండ్లు, తోలుబొమ్మలాట, రచ్చబండ, శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి, శ్రీ దేశాలమ్మ గుడి నమూనాలను వేశారు. అతిథులకు పిండివంటలు రుచి చూపించారు. గంగిరెద్దులు, సోది సుబ్బక్క, దేవర వేషాలు, హరిదాసులు, కొమ్మరదాసులు, పిట్టల దొరలు, డప్పు వాయిద్యాలు, కేరళ నృత్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల డైరెక్టర్ ఎంఎస్ఎన్ మూర్తి, ప్రిన్సిపాల్ పద్మకళ, హెచ్ఎం డి.భవాని పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థినికి ల్యాప్‌టాప్ బహూకరణ



దువ్వ పాఠశాల విద్యార్థినికి ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న బైర్రాజు ఫౌండేషన్ సభ్యులు

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం దువ్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీకి బైర్రాజు ఫౌండేషన్ ద్వారా ల్యాప్‌టాప్‌ను బహూకరించినట్లు పాఠశాల హెచ్ఎం పీటీవీ లక్ష్మణాచార్యులు తెలిపారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బైర్రాజు ఫౌండేషన్ కోఆర్డినేటర్ పీ.శ్రీనివాస రాజు చేతులు మీదుగా విద్యార్థిని అడ్డాల దుర్గా లక్ష్మీకి ల్యాప్‌టాప్‌ను అందజేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఫౌండేషన్ గ్రామ వికాస సమితి కన్వీనర్ వీ సత్యనారాయణరాజు, కో కన్వీనర్ ఐ రంగరాజు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజయశ్రీ మరణం కళారంగానికి తీరని లోటు



కలికివాయ విజయశ్రీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రముఖ హరికథ కళాకారిణి, తాడేపల్లిగూడెం వాస్తవ్యురాలు కలికివాయ విజయశ్రీ భాగవతార్ (82) మృతి కళారంగానికి తీరనిలోటు అని పలువురు కళాకారులు సంతాపం వ్యక్తం చేశారు. విజయశ్రీ హైదరాబాద్‌లో మృతి చెందారు. గత 60సంవత్సరాల నుంచి వివిధ రాష్ట్రాల్లో హరికథగానం చేసి ప్రముఖులచే ఎన్నో సన్మానాలు పొందారు. ఆల్ ఇండియా రేడియో ఆర్టిస్ట్‌గా రేడియోలో అనేక పర్యాయాలు హరికథ గానం చేసి శ్రోతులు, ప్రేక్షకుల అభిమానం పొందారు.

డీఆర్‌జీలో ఘనంగా ముగ్గుల పోటీలు



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గులపోటీలు పరిశీలిస్తున్న మహిళా అధ్యాపకులు

పెంటపాడు: విద్యార్థులు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను మర్చిపోరాదని డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం. శ్యాంబాబు పేర్కొన్నారు. స్థానిక కళాశాల ఆడిటోయం వద్ద సోమవారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి విశిష్టత, ముగ్గుల సంస్కృతి సంప్రదాయాలు, బోగిమంటలు తదితర విషయాలను తెలుగువిభాగం ఆధ్వర్యంలో డాక్టర్ సుంకర గోపాల్ విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పీఎస్ బ్రహ్మాచారి, మహిళాసాధికారత విభాగాధిపతి డా.జి. వాణి, డా.జేవీ జయంతికుమారి, ప్రేమ్‌సాగర్, జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు బెల్టుల పంపిణీ



కరాటే బెల్టు గ్రేడింగ్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

తణుకు టౌన్: తణుకులోని కేఎస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో బెల్టు గ్రేడింగ్ కార్యక్రమం నిర్వహించినట్లు అకాడమి చైర్మన్ కేతా శ్రీనివాసు తెలిపారు. సోమవారం తణుకులోని ఎస్‌సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగిన ఈకార్యక్రమానికి అకాడమి చైర్మన్ శ్రీనివాస్ ఎగ్జామినర్‌గా వ్యవహరించినట్లు తెలిపారు. మొత్తం 150 మంది కరాటే విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కరాటే విద్యార్థులకు యెల్లో, ఆరంజ్, గ్రీన్, బ్లూ, పర్పుల్, బ్రౌన్, బెల్ట్స్‌తో పాటు విద్యార్థులకు సర్టిఫికేట్‌లను అందజేశారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

ఇరగవరం: మండలంలోని డ్వాక్రా మహిళలకు గొర్రెలను పంపిణీ చేయడం జరిగిందని ఏపీఎం తలారి పుష్పవతి అన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం వీటిని అందిస్తుందన్నారు. వీటిని బాగా పెంచి తద్వారా ఆదాయం ఆర్జించి కుటుంబాన్ని ఎదిగేలా చూసుకోవాలన్నారు. మండలంలో మొత్తం 9 యూనిట్లు ఇవ్వడం జరిగిందన్నారు. పాదలాడ 1, రేలంగి 2, ఇరగవరం 2, కావలిపురం 1, తూర్పు విప్పర్రు 2, సూరంపూడి1, అందించామన్నారు. మహిళలు ప్రతి ఒక్కరూ శ్రద్ధతో వీటిని పెంచి ప్రభుత్వంఏ లక్ష్యంతో అయితే వీటిని అందించిందో అది నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల్లోని వైసీపీ నాయకులు, డ్వాక్రా మహిళలు, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణయుగం దిశగా జగన్ పాలన



అత్తిలిలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న దృశ్యం

అత్తిలి: రాష్ట్రంలో స్వర్ణయుగాన్ని తలపించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పాలనకు ప్రజలంతా మద్దతుగా నిలవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. వైఎస్ జగన్ రాష్ట్రంలో నిర్వహించిన ప్రజాసంకల్పయాత్ర ముగిసి నాలుగేళ్ల పూర్తి అయిన సందర్భంగా సోమవారం అత్తిలి బస్‌స్టేషన్ సెంటర్‌లో కేక్ కట్‌చేసి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పైబోయిన మాట్లాడుతూ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో దేశంలోనే జగన్ ముందంజలో ఉన్నారన్నారు. రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకోవడానికి సుమారుగా 3 వేల కిలోమీటర్లకు పైగా పాదయాత్ర చేసి వారి ఇబ్బందులను తొలగించడానికి నవరత్న పథకాలను అమలు చేస్తున్నారని సత్యనారాయణ తెలిపారు. ప్రజల అవసరాలు తీర్చడానికి ఎన్నికల్లో ఇవ్వని హామీలను సైతం అమలు చేస్తున్న ఘనత జగన్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. గడిచిన మూడున్నరేళ్ల పాలనలో 98 శాతానికి పైగా హామీలను అమలు చేసి ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావడానికి చేయూతనిచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, సర్పంచ్ గంటావిజీత నాగరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, అత్తిలి టౌన్ అధ్యక్షులు పోలినాటి చంద్రరావు, బీసీ సెల్ అధ్యక్షుడు రంభ సూరిబాబు, ఎస్సీసెల్ అధ్యక్షులు కోరుకొల్లు వెంకట్రావు, మహిళా విభాగం అధ్యక్షురాలు కాకర్ల విశాలాక్షి, సేవాదళ్ అధ్యక్షులు కంకటాల సతీష్, సోషల్ మీడియా కోకన్వీనర్ బుడితి సుజన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు కందుల సత్యనారాయణ, కాగసాని అబ్బులు, గంటా నాగరాజు, రాయుడు ధర్మారావు, బుంగా పద్మారావు, చిటకన వెంకట్రావు, ఆకుల చినబాబు, భీమవరపు నాగేశ్వరరావు, కాసగాని చిన్నా, దిరిశాల నాగబాబు, ఫ్రాన్సిస్, యాళ్ల రాజేష్ పాల్గొన్నారు.

ప్రజాసంకల్పయాత్ర చారిత్రాత్మకం...

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర చారిత్రాత్మకమని ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించిన ప్రజాసంకల్పయాత్రకు నాలుగేళ్లు పూరైన సందర్భంగా తణుకు రాష్ట్రపతి రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ప్రజాసంకల్పయాత్రలో ప్రజల కష్టాలు నేరుగా చూసిన అనంతరంసీఎం జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను సృష్టించారని అన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లోనే సంక్షేమం అందుతున్న నేపథ్యంలో ప్రజాసంకల్పయాత్రకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు.ముందుగా తణుకు రాష్ట్రపతి రోడ్డు, సొసైటీ వీధిలోని వైస్సార్ పార్కులో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వైఎస్సార్‌సీపీ తణుకు మండల అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్ (పీబీఆర్), ఎంపీపీ రుద్రా ధనరాజు, తణుకు మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు డా.దాట్ల సుందరరామరాజు, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, షేక్ బాజీ, షేక్ సలీం, ములగాల శ్రీనివాస్, సామంతుల అప్పారావు, పుల్లెపు సూరిబాబు, రేలంగి రాంబాబు, కొమ్మోజు రామకృష్ణ, కుడుపూడి చంద్రరావు, గనసాల సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరంలో: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రంలో నిర్వహించిన ప్రజాసంకల్పయాత్ర ముగిసి నాలుగేళ్ల పూర్తి అయిన సందర్భంగా సోమవారం వైఎస్సార్ విగ్రహానికి డీసీఎంఎస్ డైరెక్టర్ సుబ్బరాజు, మండల పార్టీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్‌లు వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు యుగంధర్, ఎమ్పీటీసీలు మంగేన రామానాయుడు,పాల పాలేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్ శ్రీనివాస్‌లు ఉన్నారు.

నేడు డాక్టర్ ఉమర్ ఆలీషా తాడేపల్లిగూడెంకు రాక

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠము (పీఠాపురం) డాక్టర్ ఉమర్ ఆలీషా 10వ తేదీన మంగళవారం పట్టణానికి విచ్చేయనున్నారు. సత్యవతినగర్ రోడ్డు నెంబర్ 9 చెట్లు రోడ్డులోని పీఠం ఆశ్రమశాఖలో సాయంత్రం ఆధ్యాత్మిక, తాత్విక జ్ఞాన ప్రబోధం చేయనున్నట్లు నిర్వాహకులు టి.త్రిమూర్తులు, గంధం బాబు, ఎ.ఎన్. వెంకటరత్నంలు తెలిపారు. పట్టణ, పరిసర గ్రామ పీఠం సభ్యులు, భక్తులు హాజరుకావాలని కోరారు.

బలుసులమ్మ అమ్మవారికి ఊరేగింపు గొడుగు అందజేత



బలుసులమ్మ అమ్మవారి ఊరేగింపు గొడుగు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి ఉత్సవమూర్తి ఊరేగింపు నిమిత్తం అవసరమైన గొడుగు, ఖరీదైన అమ్మవారి చిత్రపటాలను, బ్యానర్స్‌ను వాసవీ క్లబ్ మాజీ అధ్యక్షుడు, ప్రముఖ ఆడిటర్ నారాయణ రాంబాబు అందజేయనున్నారు. సోమవారం అమ్మవారి ఆలయం వద్ద గొడుగు, బ్యానర్స్‌ను భక్తులు సందర్శనార్థం ఉంచారు. ఈ నెల 14వ తేదీ భోగి రోజున అమ్మవారికి అందజేస్తున్నట్లు రాంబాబు వివరించారు.

పింఛన్లు ఓ సామాజిక బాధ్యత

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ



లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: సామాజిక బాధ్యతలో భాగంగా పింఛన్లు పంపిణీకి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. పింఛను కారణంగా ఎందరో అభాగ్యులకు ఆర్థిక భరోసా దక్కుతుందని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. ఆయన క్యాంపు కార్యాలయం వద్ద గూడెం మండలంలోని నూతనంగా అర్హత సాధించిన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ అర్హత సాధించిన ప్రతీ కుటుంబానికి సంక్షేమాన్ని అందించడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఆదిశగానే పాలన సాగించి ప్రజల మన్ననలు పొందారన్నారు. రాబోయే ఎన్నికల్లో తిరిగి జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకొనేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల్లో లేని సంక్షేమ పాలన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్నారన్నారు. కేంద్రప్రభుత్వం రాష్ట్రంలోని 80 లక్షల మందికి మాత్రమే రేషన్ బియ్యం అందిస్తుందని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని 1.60 కోట్ల కుటుంబాలకు రేషన్ అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు సౌకర్యాలు అందించడంలో రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగానే ఖర్చు చేయడం జగన్ సమర్థతకు అద్దం పడుతుందన్నారు. తెదేపా హయాంలో రాష్ట్రంలోని 30 లక్షల మందికి పింఛన్లు అందచేస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 65 లక్షల మందికి రూ. 1885 కోట్లు పింఛన్లు అందజేస్తుందని తెలిపారు. జగన్ పాలన ఇదే తీరులో సాగితే తమకు మనుగడ ఉండదని భయంతో పచ్చమీడియా వంకర రాతలు రాస్తుందని విమర్శించారు.

మహిళల ఉసురుతో చంద్రబాబు పాతాళానికి

గతంలో మహిళలకు డ్వాక్రా రుణాలు, బ్యాంకు బంగారు రుణాలు, రైతులకు రుణాలు మాఫీ చేస్తానని చెప్పి మోసం చేసి 90 లక్షల మంది మహిళల ఉసురుపోసుకున్న చంద్రబాబు పాతాళానికి కూరుకుపోయాడన్నారు. రాష్ట్రప్రజల పట్ల విషనాగు చంద్రబాబుగా పేరును సార్థకం చేసుకొన్నాడన్నారు. జగన్ పాలన పట్ల చంద్రబాబుతోపాటు పవన్‌కు గగుర్పాటుగా ఉందన్నారు. పవన్‌ను ముఖ్యమంత్రిని చేద్దామని కోరుకున్న జనసేన కార్యకర్తలు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. తన సహకారంతో ఎంపీటీసీగా గెలిచిన వ్యక్తి జిల్లా పరిషత్‌కు ఎగబాకి తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి ద్రోహం చేశాడని అటువంటి వారికి పుట్టగతులుండవన్నారు. అభివృద్ధి పేరుతో ప్రభుత్వ నిధులను దోచేయండంతోపాటు పేదకూలీలకు అండగా ఉన్న ఎన్ఆర్ఈజీఎస్ పథకంలోను అవినీతికి పాల్పడ్డారన్నారు. కూలీల కష్టాన్ని దోచుకుతినడంతోపాటు చెరువు తవ్వకం పేరుతో ప్రభుత్వ నిధులను మింగి మట్టిని వ్యాపారం చేసుకొని కోట్లు దోచుకున్నాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, జడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, ఎంపీటీసీ సత్యవతి, వెలశెట్టి నరేంద్రకుమార్, పెద్దఅబ్బులు, ముప్పిడి సంపత్‌కుమార్, పరిమి దాసు, తమ్మిశెట్టి చుక్కయ్య, మార్లపూడి సుబ్బారావు, సూర్పణ రామకృష్ణ, పాల్గొన్నారు.

యువత కోడిపందేలు, జూదానికి దూరంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రూరల్ ఎస్సై ఎన్.శ్రీనివాసరావు

తాడేపల్లిగూడెం రూరల్: సంక్రాంతిని సంప్రదాయ క్రీడలతో ఆనందంగా జరుపుకోవాలని తహసీల్దార్ వైకేవీ.అప్పారావు అన్నారు. సోమవారం మండలంలోని మొదుగ గుంట గ్రామ సచివాలయం వద్ద కోడి పందేలు, పేకాట, జూదం వంటివి నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అప్పారావు మాట్లాడుతూ యువత కోడిపందేలు, పేకాటకు దూరంగా ఉండాలని, కబడ్డీ, కోకో, వాలీబాల్ వంటి సాంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలన్నారు. రూరల్ ఎస్సై ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో కోడిపందేలు నిర్వహిస్తున్నట్టు తెలిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. యువత ఇటువంటి జూద క్రీడలకు దూరంగా ఉండాలన్నారు. కోడిపందేలు, పేకాట వంటి వాటికి స్థలాలు సమకూర్చినా, నిర్వహించినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మొదుగ గుంట, మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో గతంలో వేసిన కోడిపందాల బరులను ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): నీటి నిల్వలు దోమలకు నిలయాలని, వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని 1,2,3,4 వార్డుల్లో సోమవారం ఫీవర్ సర్వేలు, వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యాక్రమాలు, పరిసరాలలో క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రత వాతావరణం వల్ల వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నీటి నిల్వలు పెరగకుండా చూడాలని, పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. ప్రాథమిక కేంద్రాల్లో అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం ఇంటింటికి వెళ్ళి పరిసరాలు పరిశుభ్రత, దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శి సరళ, సహాయకులు కాంతారావు, కార్యకర్తలు భవాని లక్ష్మి, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కాండం తొలుచు పురుగుపై అప్రమత్తత అవసరం



దర్శిపర్రులో రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

పెంటపాడు: దాళ్వా వరినాట్లలో నారు నాణ్యతా లోపం వల్ల అక్కడక్కడ వ్యాపించే కాండం తొలుచు పురుగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మార్టేరు వ్యవసాయ పరిశోధనాసంస్థ, ఉండి కేవీకే శాస్త్రవేత్తలు డా.సీహెచ్ శ్రీనివాస్, డా.ఎస్. మల్లికార్జునరావులు పేర్కొన్నారు. సోమవారం వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్తలు మండలంలోని దర్శిపర్రు, బోడపాడు తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు నాట్లు వేసిన 21 రోజుల అనంతరం పోషణలేని నారుమడులను పరిశీలించారు. ప్రధానంగా మండలంలో సుమారు 100,150 ఎకరాలు కాండం కుళ్లు ఉన్నట్లు గుర్తించారు. వరినారులో లోపం వల్ల ఈ కాండం తొలుచు పురుగు ఏర్పడి క్రమేపీ మొక్కను నిర్వీర్యం చేసి నాట్లు దెబ్బతినేలా చేస్తుందన్నారు. ఆ నారు నుంచి తెల్లటి పురుగులను బయటకు తీసి రైతులకు చూపారు. డిసెంబర్ 10–20 తేదీల మధ్య నాట్లు వేసిన చేలలో ఈ ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. దీంతో పాటు, ఆకుముడత కూడా అక్కడడక్కడా కనిపిస్తోందన్నారు. వీటి నివారణకు చేలలో నీరు తగ్గించి కార్టాప్ హైడ్రోక్లోరెడ్ 4 కేజీ గుళికలు లేదా, క్లోరిఫైరిఫాస్ ఎకరాకు 400 మిల్లీ లేదా, ఎసిఫేట్ 300 గ్రాములు పిచికారి చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సమీపంలోని వీఏఏ, ఏవోలను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరంకు చెందిన ఏడీఏ డీఆర్‌సీ జి. రామలింగేశ్వరరావు, కె. కాళీమాత, గూడెం ఏడీఏ పి. మురళీకృష్ణ, ఏవో పార్థసారథి, మండలంలోని ఆయా గ్రామాల వీఏఏలతో పాటు, దర్శిపర్రు సర్పంచ్ కోలా శేషవేణి, ఉపసర్పంచ్ కోలా మార్కండేయులు, వీఏఏ విజయ ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

'కొట్టు'ను విమర్శించే అర్హత మీకు లేదు

- జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు

తాడేపల్లిగూడెం రూరల్: అవినీతి మరక అంటని నాయకుడు ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అని జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చినతాడేపల్లి గ్రామంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణపై మాజీ ఎంపీపీ పరిమి రవి కుమార్ చేసిన నిరాధార ఆరోపణలపై ధ్వజమెత్తారు. ఎన్ఆర్ఈజీఎస్, డ్వాక్రా మహిళల నుంచి లక్షలాది రూపాయలు దోచేసిన నీకు కొట్టు సత్యనారాయణ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. కర్ర చెరువును 40 నుంచి 50 అడుగులు తవ్వేసి ఒక వ్యక్తి మృతికి కారణమయ్యావని, ఆ పాపం ఊరికే పోదన్నారు.ఆయన వెంట గ్రామ సర్పంచ్ పిచ్చికల రాజారావు, ఉప సర్పంచ్ చిట్టూరి కాశీవిశ్వనాథం, సొసైటీ చైర్మన్‌లు వెలిశెట్టి నరేంద్రకుమార్, పరిమి తులసీదాస్, గుల్లపల్లి ధర్మరాజులు ఉన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

వీరవాసరం: మన సాంప్రదాయాలను కాపాడుకుంటూ సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకోవాలని వీరవాసరం ఎస్ఎంబీటీ ఏవీ అండ్ ఎస్ఎస్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వర్ధినీడి సత్యనారాయణ (బాబ్జి) తెలిపారు. కళాశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రంగవల్లులు, గొబ్బెమ్మలతో కళాశాల ప్రాంగణాన్ని అలంకరించారు. సంప్రదాయ నృత్యాలతో ఆడిపాడారు.

నియోనిటల్ అంబులెన్స్ సేవలపై అవగాహన



నియోనిటల్ అంబులెన్స్ సేవలపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాజేష్, మౌనిక

పెంటపాడు: రాష్ట్ర ప్రభుత్వం నవజాత శిశువుల కోసం ఏర్పాటు చేసిన నియోనిటల్ అంబులెన్స్ సేవలపై సిబ్బంది అవగాహన పెంచుకోవాలని పెంటపాడు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ తోట రాజేష్, డాక్టర్ మౌనిక అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నియోనిటల్ అంబులెన్స్ సోమవారం పెంటపాడు పీహెచ్‌సీకి వచ్చింది. జిల్లాకు రెండు వాహనాల చొప్పన ప్రభుత్వం కేటాయించగా, సిబ్బందికి అవగాహన కోసం పలు ప్రాంతాలలో సిబ్బంది డెమో అందించారు. ఈ సందర్భంగా శిశువుల సంజీవనిగా పిలిచే ఈ అంబులెన్స్‌లో అధునాతన పరికరాలైన ఇంక్యుబేటర్, వెంటిలేటర్, మోనిటర్, సిరంజి, ఆక్సిజన్ తదితర విభాగాలను వైద్యులు సిబ్బందికి వివరించారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి 28 రోజుల వరకు బిడ్డకు సురక్షితంగా ఉండే ఈ అంబులెన్స్ నిరంతరం జిల్లాలో అందుబాటులో ఉంటుందని అంబులెన్స్ ఆపరేషన్ ముఖ్య అధికారి డి.రాజు, జిల్లా మేనేజర్ గణేష్ చెప్పారు. కాగా ఈ సేవలను ప్రతి తల్లి సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీహెచ్‌సీ సిబ్బంది సత్యనారాయణ, తేజోనాథ్, సాయి, 108 సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

అత్తిలి: వరినాట్లు సమయంలో రైతులు ఎరువుల యాజమాన్య పద్ధతులను పాటించాలని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. అత్తిలి మండలంలో ముమ్మరంగా వరినాట్ల ప్రక్రియ కొనసాగుతోందని, తగిన మోతాదులోనే చేలల్లో ఎరువులను చల్లాలని కోరారు. నాట్లు వేయడానికి వారం రోజుల ముందు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఒక సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున వేయడం ద్వారా ఊడ్చిన నెలరోజుల వరకు పురుగు ఉధృతి ఉండదన్నారు. ఆకు సుతలను తెంపి ఊడ్చడం ద్వారా మొవ్వు పురుగు గ్రుడ్లు నశించి, పురుగు ఉధృతి ఉండదని తెలిపారు. రైతులందరూ భాస్వరాన్ని ఇచ్చే ఎరువులైన సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను దమ్ములోనే వేయాలని సూచించారు.

నవరత్నాలతో సంక్షేమం!

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



చినతాడేపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: నవరత్నాలు...సంక్షేమానికి చిహ్నాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానసపుత్రికలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అభివర్ణించారు.అర్హతున్న ప్రతి ఒక్కరికీ..కులం, మతం పార్టీ చూడకుండా సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ అందిస్తున్నామని తెలిపారు. సోమవారం సాయంత్రం తాడేపల్లిగూడెం మండలం చినతాడేపల్లి గ్రామంలో మూడో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్ అందిస్తున్న పాలనను స్వాగతిస్తే చంద్రబాబు గౌరవం పెరిగేదన్నారు. అయితే, దత్తపుత్రుడు పవన్ 11 మందిని పొట్టన పెట్టుకున్న చంద్రబాబుతో కలిసి రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందని, దాన్ని అంతమొందించాలని వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పేదలకు న్యాయం చేయడం రాక్షస పాలనా? అని ప్రశ్నించారు. ఎవరిది రాక్షస పాలనే అనేది ప్రజల్లోకి వస్తే తెలుస్తుందన్నారు. ప్రతిపక్షాలను సైతం మెప్పించే విధంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. చేయనిది చేసినట్టుగా చెబితే ప్రజలే నిలదీస్తారన్నారు. ప్రపంచ మేధావిగా తను తానే చెప్పుకునే చంద్రబాబుకు ఇటువంటి ఆలోచన రాకపోవడంపై పచ్చమీడియా ఎందుకు ఆత్మవిమర్శ చేసుకోవడం లేదని ప్రశ్నించారు. వయస్సు పెరిగితే హుందాతనం రావాలని, అది మచ్చుకైనా చంద్రబాబులో కనిపించడం లేదని విమర్శించారు. నేడు ఎక్కడ చూసినా వైఎస్సార్, సీఎం జగన్ పథకాలే కనిపిస్తున్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వానికి వస్తున్న ఆధరణ చూసి ప్రతిపక్షనాయకుడు చంద్రబాబు ఓర్వలేక పోతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, సర్పంచ్ పిచ్చికల రాజారావు, ఉప సర్పంచ్ చిట్టూరి కాశీవిశ్వనాథం, తహసీల్దార్‌వైకేవీ. అప్పారావు, ఎంపీడీవో ఎం.వెంకటేష్, పీఆర్ డీఈ వేణుగోపాల్, ఏపీఎం జీవీకేడీ ఎం.లక్ష్మి, ఏపీవో ఏవీవీఎస్‌వీ.ప్రసాద్, మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్, హౌసింగ్ ఏఈ వైవి.వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శులు రవిచంద్ర, బి.రమేష్, ఎమ్పీటీసీ దూలపల్లి సత్తియ్య, మార్లపూడి సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, సంతపరావు కృష్ణారావు, పిచ్చికల శ్రీనివాస్, వెలిశెట్టి నరేంద్రకుమార్, పరిమి తులసీదాస్, చిక్కాల సత్యనారాయణ, గుల్లపల్లి ధర్మరాజు, యాళ్ళ రాజు, కారింకి వీర్రాజు, బత్తిన గణేష్, కొండుబోయినకృపావరం, మద్దుకూరి రామావతారం, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.